క్లుప్తంగా

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం


పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు

సి.బెళగల్: మండల కేంద్రంలోని పార్కులో టీడీపీ వ్యవస్థాపకుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహానికి ఆ పార్టీ నాయకులు శుక్రవారం పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో టీడీపీ విజయం సాధించడంతో సంబరాలు చేసుకున్నారు. మండల అభివృద్ధి కృషి చేస్తామని పార్టీ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వీరన్నగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాండురంగన్నగౌడ్, నాయకులు చిన్న తిమ్మప్ప, బాలాజీ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్ ర్యాంకర్ సానియా దేశాయ్‌కు సన్మానం



సానియా దేశాయ్‌ను సన్మానిస్తున్న అవాజ్ కమిటీ నాయకులు

కర్నూలు(సెంట్రల్): సీపీఎం స్థానిక నేత అబ్దుల్ దేశాయ్ కుమార్తె సానియా దేశాయ్ నీట్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించింది. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో ఆమెకు 582 మార్కులు వచ్చాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆమెను అవాజ్ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి.ఇక్బాల్‌హుస్సేన్, షేక్ మహ్మద్ షరీఫ్ తదితరులు సన్మానించారు. వైద్యురాలిగా పేదలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, అవాజ్ కమిటీ నాయకులు రషీదాదేశాయ్, ఖాజాపాషా, చాన్‌బాషా, డాక్టర్ సలీం, ఆర్ఎంపీ హర్షద్ సాదిక్ బాషా పాల్గొన్నారు.

డీసీసీబీ డైరెక్టర్ పదవికి రాజీనామా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ నాన్ అఫీషియల్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ సభ్యత్వానికి (డైరెక్టర్) కె.వెంకటరామిరెడ్డి శుక్రవారం రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందిన నేపథ్యంలో పదవిలో కొనసాగరాదనే ఉద్దేశంతో రాజీనామా చేసినట్లు తెలిపారు. డీసీసీబీ సీఈఓ విజయకుమార్ అందుబాటులో లేకపోవడంతో జనరల్ మేనేజర్ పి.రామాంజనేయులుకు రాజీనామా పత్రాన్ని అందజేశారు. డీసీసీసీ పాలకవర్గం సభ్యుడిగా తనకు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేయాలి

కర్నూలు(సెంట్రల్): రైతులు ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో సమృద్ధిగా విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై సరఫరా చేయాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథం శుక్రవారం డిమాండ్ చేశారు. అలాగే బ్యాంకుల నుంచి రైతులకు పంటల పెట్టుబడికి అవసరమైన రుణాలను ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. బ్యాంకులు రైతులకు రుణాలు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాయని, వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు.

ఐకమత్యంగా మెలగాలి

కృష్ణగిరి: ఎన్నికలు ప్రశాతంగా ముగిశాయని, ప్రతిఒక్కరూ ఐకమత్యంగా మెలగాలని వెల్దుర్తి సీఐ సురేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఆయన ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో తొగర్చేడు గ్రామానికి చెందిన ఇరువర్గాలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. గెలుపోటములను సమానంగా స్వీకరించాలని, పంతాలు, పట్టింపులకు పోతే జీవితాలు నాశనం అవుతాయన్నారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించుకోవాలని సూచించారు.

పాణ్యంకు చేరుకున్న పాఠ్యపుస్తకాలు

పాణ్యం: 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్‌లు వచ్చాయని ఎంఈఓ కోటయ్య శుక్రవారం తెలిపారు. ప్రస్తుతం మండలానికి 25 వేల పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్‌లు, బెల్ట్‌లు వచ్చాయన్నారు. షూ, యునిఫాం రావాల్సి ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పాఠశాలలు పునఃప్రారంభమైన తర్వాత విద్యార్థులకు అందజేస్తామని పేర్కొన్నారు.

ముగిసిన సమ్మర్ క్యాంప్

కర్నూలు కల్చరల్: జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థలో మే 5వ తేదీ నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు శుక్రవారం ముగిశాయి. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రకాష్ ముగింపు కార్యక్రమంలో ప్రసంగించారు. సమ్మర్ క్యాంపులో విద్యార్థులు నేర్చుకున్న వివిధ అంశాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు జ్ఞాపికలు అందజేశారు. డిప్యూటీ లైబ్రేరియన్ పెద్దక్క, ఉపాధ్యాయులు దామోదర్, యాగంటీశ్వరప్ప, లైబ్రేరియన్లు గోవింద రెడ్డి, ఎస్.బాషా, చంద్రమ్మ, నసీమాబీ పాల్గొన్నారు.

దివ్యాంగులు బడిబాట పట్టేలా!

- ప్రత్యేక అవసరాల పిల్లల గుర్తింపునకు సర్వే
- మండలంలో 22 మంది గుర్తింపు
- రాయితీలపై అవగాహన కల్పిస్తున్న భవిత ఉపాధ్యాయులు


పెసరవాయి గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

గడివేముల: దివ్యాంగ చిన్నారులు బడిబాట పట్టించే దిశగా భవిత కేంద్రం ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చదువుకు దూర మైన ప్రత్యేక అవసరాల పిల్లలను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకూ పాఠశాలల్లో చేరని వారితో పాటు మధ్యలో విద్యకు దూరమైన వారి వివరాలు సైతం సేకరిస్తున్నారు. చదువు వల్ల కలిగే ప్రయోజనాలు, దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీల గురించి దివ్యాంగ పిల్లల తల్లి దండ్రులకు వివరిస్తున్నారు. ఈ సర్వేలో భాగంగా ఇప్పటికే మండలంలో 22 మంది చిన్నారులను గుర్తించారు. వారంతా బడికి వచ్చేందుకు ముందుకు వచ్చారని భవిత కేంద్రం నిర్వాహకులు చెబుతున్నారు. ఇంటింటి సర్వేసాధారణ విద్యార్థులతో సమానంగా దివ్యాంగ చిన్నారులను కూడా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలతో అనేక కార్యక్రమాలు చేపడుతోంది. వాటిపై అవగాహన లేకపోవడంతో చాలామంది దివ్యాంగుల తల్లిదండ్రులు వాటి ప్రయోజనాలు పొందలేక పోతున్నారు. వారికి కూడా విద్యను అందించే కేంద్రాలున్నాయని తెలియకపోవడంతో చదువుకు దూరమై, ఇళ్లకే పరి మితమై ఉండిపోతున్నారు. ఇప్పుడు ఇలాంటి వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. పాఠశాలలు తెరిచే నాటికి గుర్తించిన వారందరినీ బడుల్లో చేర్పించేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశారు. ఇప్పటికే 115 మంది ప్రత్యేక అవసరాల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రయోజనాలు ఇలా...

- దివ్యాంగ విద్యార్థుల చదువుకు అవసరమైన ఉపకరణాలను ఉచితంగా మంజూరు చేస్తున్నారు. నెలకు రూ.300 చొప్పున రవాణా చార్జీలు చెల్లిస్తున్నారు.
- వినికిడి, దృష్టి లోపం ఉన్న వారికి ఉచితంగా ట్యాబులు అందజేస్తారు.
- అంగవైకల్య శాతం అధికంగా ఉన్న వారికి సదరం ధ్రువపత్రాలతో సామాజిక పింఛను అందేలా చూస్తారు.
- బస్సులు, రైళ్లలో ప్రయాణం చేయడానికి పాస్‌లు సదుపాయం కల్పిస్తున్నారు.
- పాఠశాలకు రాలేని వ్యక్తుల ఇళ్లకు ఉపాధ్యాయులే వెళ్లి ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

ఏ ఒక్కరూ చదువుకు దూరం కారాదు



ప్రత్యేక అవసరాల పిల్లలు ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదు. పాఠశాలల్లో చేరి ప్రభుత్వం కల్పిస్తున్న అవసరాలను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్య పరుస్తున్నాం. ఇప్పటి వరకు మండలంలో 22 మంది చిన్నారులను గుర్తించాం. వారంతా బడికి వచ్చే అవకాశాలున్నా రావడం లేదు. చిన్నారులను భవిత కేంద్రానికి రప్పించి విద్యాబుద్ధులు నేర్పిస్తాం. ఈ నెల 9వ తేదీ వరకు ఈ సర్వే కొనసాగుతుంది.

– సయ్యద్ పక్కీర్ సాహేబ్, ఐఈఆర్‌టీ ప్రత్యేక ఉపాధ్యాయుడు, గడివేముల

మతిస్థిమితంలేని మహిళను కుటుంబ సభ్యులకు అప్పగింత


అవుకు పోలీస్ స్టేషన్‌లో మతిస్థిమితంలేని మహిళను వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

అవుకు: జిల్లా కేంద్రం కర్నూలులోని బాలాజీ నగర్‌కు చెందిన మతిస్థిమితంలేని మహిళను ఆమె బంధువులకు శుక్రవారం అవుకు ఎస్‌ఐ కిరణ్‌బాబు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శివమ్మ అప్పగించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని శివవరంలో కొన్నిరోజులుగా మతిస్థిమితం సరిగాలేని ఓ మహిళ ఒంటరిగా తిరుగుతుండగా తలారులు సమాచారం మేరకు గ్రామ మహిళా పోలీస్, పంచాయతీ కార్యదర్శి సహకారంతో అవుకు పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఎస్‌ఐ విచారించగా ఈ నెల 1వ తేదీన షేక్ ముజ్జాకర్ మతిస్థిమితం సరిగాలేని తన చెల్లెలు కనబడడంలేదని కర్నూలు తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలింది. ఈ మేరకు షేక్ ముజ్జాకర్‌తోపాటు కుటుంబ సభ్యులను పిలిపించి మతిస్థిమితంలేని షేక్ సమీనను అప్పగించామని చెప్పారు.

బకాయిలు విడుదలయ్యేలా చూడాలని వినతి

- ఎమ్మెల్యేను కోరిన హెచ్‌ఎంలు


ఎమ్మెల్యేను అభినందిస్తున్న హెచ్‌ఎంలు

ఓర్వకల్లు: పాఠశాలల నిర్వహణ ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం కేటాయించిన నిధుల బకాలయిలు విడుదలయ్యేలా చూడాలని ఏపీ హెచ్‌ఎం అసోసియేషన్ నాయకులు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డికి విన్నవించారు. ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆమెను శుక్రవారం ఆ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి పాఠశాలల నిర్వహణ నిధులను విడుదల చేయకపోవడంతో ప్రధానోపాధ్యాయులు చేతినుంచి ఖర్చు పెట్టుకున్నారని తెలిపారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి, నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే తన వంతు కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు. ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణ, సభ్యులు ఓంకార్‌యాదవ్, ఉస్సేన్, చంద్రశేఖర్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన క్రీడా సంఘాల ప్రతినిధులు


గౌరు చరితను సన్మానిస్తున్న క్రీడా సంఘాల ప్రతినిధులు

కర్నూలు (టౌన్): పాణ్యం ఎమ్మెల్యేగా గెలుపొందిన గౌరు చరితారెడ్డిని క్రీడా సంఘాల ప్రతినిధులు కలిశారు. ఆంధ్రప్రదేశ్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్కూల్‌గేమ్స్ కార్యదర్శి జోసెఫ్ లక్ష్మయ్య తదితరులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు శ్రీనివాసులు, వెంకటరాముడు, బాషా, సిరాజ్, రత్నారెడ్డి, క్రిష్ణమూర్తి, తిమ్మప్ప, పాల్గొన్నారు.

దంచికొట్టిన వాన

కల్లూరు: కల్లూరు గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. సుమారు రెండు గంటల పాటు వర్షం దంచి కొట్టింది. అర్బన్ పరిధిలోని ముజఫర్‌నగర్, పందిపాడు, కల్లూరు ఎస్టేట్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు పొంగి ప్రవహించాయి. కల్లూరు అర్బన్ ఇండస్ట్రీయల్ ఎస్టేట్‌లోని (పందిపాడు) ఇందిరమ్మ కాలనీలో వర్షం నీరు చేరింది.


ఇందిరమ్మ కాలనీలో ప్రవహిస్తున్న వర్షపు నీరు

ఆస్పత్రిలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు


విద్యుత్ సమస్యలపై అధికారులతో చర్చిస్తున్న సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విద్యుత్ సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తన చాంబర్‌లో ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శివకుమార్, ఎలక్ట్రికల్ ఇంజినీర్లు, ఆస్పత్రి ఎలక్ట్రీషియన్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న కారణంగా విద్యుత్ సమస్యలు రాకుండా ఉండేందుకు ఎలాంటి నివారణ చర్యలు తీసుకోవాలన్న దానిపై ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గత నెల 15న ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులు ఆస్పత్రిని సందర్శించి పలు సూచనలు చేశారన్నారు. ఆ సూచనల ప్రకారం పనులు పూర్తి చేయనున్నట్లు చెప్పారు. అందుకే క్యాంపస్‌లో అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించామన్నారు. ఆస్పత్రిలో నాలుగు ట్రాన్స్‌ఫార్మర్లను రూ.4 లక్షలతో సర్వీసింగ్ చేయించామన్నారు. ఆస్పత్రిలో ఉన్న మూడు జనరేటర్లను సర్వీసు చేయించేందుకు కంపెనీ ఇంజినీర్లను పిలిపించి అంచనా తీసుకోవాలని ఏపీఎంఎస్ఐడీసీ అధికారులను ఆదేశించారు. ఎలక్ట్రికల్ సిబ్బందికి రోజూ షిఫ్ట్ వారీగా డ్యూటీ నిర్వహించేలా చూడాలని సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావుకు సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో ఎలక్ట్రికల్ సిబ్బందికి నైట్ డ్యూటీలు ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ వెంకటరమణ, జేఈ సెల్వం, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్ తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై కంది విత్తనాలు

గడివేముల: మండల పరిధిలోని ఆర్బీకేలలో 30 శాతం సబ్సిడీతో కంది విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు ఏఓ హేమసుందర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. కంది ఎల్ఆర్‌జీ-51, ఎల్ఆర్‌జీ-105 రకాల విత్తనాలు ఉన్నాయని.. కావాల్సిన రైతులు స్థానిక ఆర్‌బీకేలలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కేజీ రూ. 140 ఉండగా రాయితీ రూ.42 పోను రూ.98 చెల్లించాలన్నారు. అవసరమైన రైతులు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుతో ఆర్‌బీకేలో సంప్రదించాలని సూచించారు.

దరఖాస్తు చేసుకోండి

గడివేముల: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్‌తో పాటు తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలను పాఠశాలలో అందజేయాలన్నారు. ప్రవేశ పరీక్ష ఆధారంగా సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (న్యూటౌన్): విద్యుత్ సబ్‌స్టేషన్లు, లైన్ల నిర్వహణ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ డీఈ రాజేంద్రబాబు తెలిపారు. డీ2 సబ్ డివిజన్ పరిధిలోని మద్దూర్‌నగర్, సీ క్యాంప్, గణేష్‌నగర్, రెవెన్యూ కాలనీ, 4వ తరగతి ఉద్యోగుల కాలనీ, సాయి వైభవ్ నగర్, చెక్‌పోస్టు ఏరియా, శేషాద్రినగర్, బృందావన్‌నగర్, మారుతీనగర్, అరుంధతి నగర్, శ్రీరామ్‌నగర్, రెవెన్యూ కాలనీ, మారుతీ మెగాసిటీ, పోస్టల్ కాలనీ, ధనలక్ష్మీనగర్, కమలానగర్, టెలికాంనగర్, గఫార్‌నగర్, ప్రశాంతి నగర్, ఫుడ్ కార్పొరేషన్ ఏరియా, మాధవనగర్, సీ, బీ క్యాంప్, గాయత్రీ ఎస్టేట్, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పాతబస్తీ, జొహరాపురం, ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్‌బోర్డు కాలనీ, జమ్మిచెట్టు, రాంబొట్ల, కమేలా, అబ్బాస్‌నగర్, కృష్ణానగర్, రామకృష్ణానగర్, రామచంద్రనగర్, గుత్తి పెట్రోల్ బంకు ఏరియా, షరీన్‌నగర్, కల్లూరు, కల్లూరు ఎస్టేట్, శారదనగర్‌లో అంతరాయం ఉంటుందన్నారు. **గూడూరు:** కోడుమూరు, గూడూరు, సి.బెళగల్‌లోని 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో ఫీడర్లకు మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని డీఈఈ జేసస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ పరఫరా ఉండదన్నారు. రైతులు, వ్యాపారులు, గృహ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గోవులకు అస్వస్థత.. కాపాడిన పశువైద్యులు


అస్వస్థతకు గురైన ఆవులకు చికిత్స అందిస్తున్న పశువైద్యులు

కర్నూలు(అగ్రికల్చర్): విషపూరితమైన గడ్డి తిని అస్వస్థతకు గురై ప్రాణాపాయ స్థితికి చేరిన సుమారు 30 ఆవులకు పశువైద్యులు, సిబ్బంది వైద్య సేవలు అందించి కాపాడారు. ఓర్వకల్ మండలం ఉయ్యాలవాడ, బైరాపురం గ్రామాలకు కొందరు రైతులు స్థానికంగా మేత, నీరు లేకపోవడంతో 120 ఆవులను తెలంగాణ రాష్ట్రం రాజోలికి తోలికెళ్లి అక్కడి బంధువుల ద్వారా మేపుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పెరిగిన పచ్చి గడ్డి తిని 27 పశువులు అస్వస్థతకు గురయ్యాయి. కొన్ని ఆవులు ప్రాణాపాయ స్థితికి చేరాయి. సంబంధిత రైతులు జిల్లాకు చెందిన పశువైద్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కర్నూలు మండలం ఎదురూరు పశువైద్యుడు అనిష్, ఉయ్యాలవాడ పశువైద్యుడు మదన్, పారామెడికల్ సిబ్బంది అక్కడికి వెళ్లి చికిత్స అందించారు. కొద్ది గంటల్లోనే అన్ని ఆవులు కోలుకున్నాయి. సత్వరం వైద్య సేవలు అందించి ఆవులను కాపాడిన పశువైద్యలకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు కొత్తగా పెరిగిన పశుగ్రాసం విషపూరితంగా ఉంటుందని పశు వైద్యులు తెలిపారు.

వలంటీర్లకు రూ. 10 వేల వేతనం ఇవ్వాలి


మాట్లాడుతున్న సుమలత

కర్నూలు (టౌన్): ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు వలంటీర్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. శుక్రవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం చెప్పిన సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శంకరమ్మ, ముంతాజ్, షబానా, కరెమ్మ, శేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో సబ్జెక్ట్‌పై పరిపూర్ణ అవగాహన


సర్టిఫికెట్లను అందజేస్తున్న శేషయ్య, సుధాకరప్ప

కర్నూలు(సెంట్రల్): శిక్షణ ద్వారా వివిధ సబ్జెక్టుల్లో వెనుకబడిన అంశాలపై పరిపూర్ణ అవగాహన పెంచుకోవచ్చని సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం కన్వీనర్ జీఎన్ శేషయ్య, సీఐటీయూ నాయకుడు సుధాకరప్ప అన్నారు. సుందరయ్య స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో టీసీ లక్ష్మమ్మ కుట్టు శిబిరంలో 12 రోజులుగా ఇంగ్లిష్, మ్యాథ్స్, సైన్స్ తదితర సబ్జెక్టుల్లో విద్యార్థులకు ఇచ్చిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే పాఠ్యాంశాలతోపాటు సమాజంపై అవగాహన పెంచుకోవాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించే విధంగా అడుగులు వేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం శిక్షణ పొందిన 35 మంది విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ఎం జయరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు జి.హేమంత్, కౌన్సిలర్ డి.రాముడు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు ఎంపీ బసవరాజు, నాయకులు వెంటేశ్వర్లు, ఎంసీ ఆనందు, ఎం.దావీదు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో జాగ్రత్త



ప్యాలకుర్తి ఆర్బీకేలో వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న ఏఓ, రైతులతో మాట్లాడుతున్న ఏఓ

కోడుమూరు రూరల్: రైతులు నకిలీ విత్తనాలను కొనుగోలు చేసి మోసపోకుండా నాణ్యమైన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేసి పంటలను సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రవి ప్రకాష్ రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని ప్యాలకుర్తి రైతు భరోసా కేంద్రాలను ఏఓ తనిఖీ చేశారు. రైతులకు పంపిణీ చేస్తున్న వేరుశనగ విత్తనాలను పరిశీలించారు. ఖరీఫ్‌లో సాగు చేసే పంటలపై చర్చించారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ అనుమతి ఉన్న దుకాణాల్లో మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని తెలిపారు. విత్తన కొనుగోలు సమయంలో తప్పక రశీదు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా లూజు విత్తనాలు అమ్ముతుంటే వ్యవసాయాధికారులకు సమాచారమివ్వాలన్నారు. వర్షాలు పడుతున్న వేళ భూములను పంటల సాగుకు అనుకూలంగా తయారు చేసుకోవడంతో పాటు అదనులోనే విత్తనాలను విత్తుకోవాలని ఏఓ సూచించారు.


తుంగభద్రలో చేరిన వరదనీరు

తుంగభద్రకు జలకళ

సి.బెళగల్: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తుంగభద్ర నది జలకళను సంతరించుకుంది. జిల్లాలోని పడమటి ప్రాంతాలతోపాటు నది పరివాహ గ్రామాల్లో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో శుక్రవారం నదికి పెద్ద ఎత్తున వరద నీరు వచ్చింది. నదీతీర గ్రామాల్లో తాగు, సాగు నీటి సమస్యలు తీరాయని ఆయా గ్రామాల ప్రజలు, రైతులు హర్షం వ్యక్తం చేశారు. పంటల సాగుకు రైతులు పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


108వాహనంలో తరలిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్: కోడుమూరు నుంచి కర్నూలు వెళ్లే దారిలో శుక్రవారం రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాయి.. కోడుమూరుకు చెందిన తిమ్మన్న ద్విచక్రవాహనంపై కర్నూలుకు వెళ్లి తిరిగి వస్తుండగా కొత్తూరు వద్ద ముందు వెళ్తున్న మరో ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తిమ్మన్న తలకు తీవ్ర గాయమైంది. మరో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తిమ్మన్నను 108 వాహనంలో చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.